సర్కారు భూములు స్వాహా!



- జిల్లాలోని నాలుగు మండలాల్లో పూర్తయిన సర్వే
- ప్రాథమికంగా 82 ఎకరాల ఆక్రమిత భూముల గుర్తింపు
- భూముల విలువ రూ. 50 కోట్లు
- మరో 300ల ఎకరాల ప్రభుత్వ భూమిలో కొనసాగుతున్న సర్వే
- ప్రతీ మండలానికి ఓ సర్కార్ భూముల ప్రొఫైల్
- కొరడా ఝుళిపిస్తున్న జిల్లా కలెక్టర్

నిర్మల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని, వాటిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి భరతం పట్టేందుకు జిల్లా కలెక్టర్ కొరడా ఝుళిపిస్తున్నారు. సర్కార్ భూముల రక్షణ కోసం రూపొందించిన యాక్షన్ ప్లాన్ జిల్లాలోని 19 మండలాల్లో కొనసాగుతోంది. ఇందులో భాగంగానే ఇప్పటి వరకు నాలుగు మండలాల్లో దాదాపు 82 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. ఈ భూములను ఆక్రమణదారులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు కూడా అధికారులు నిర్ధారించారు. కాగా ఈ భూముల విలువ రిజిస్ట్రేషన్ శాఖ లెక్కల ప్రకారం దాదాపు 50 కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని అధికారులు వెల్లడిస్తుండగా బహిరంగ రియల్ ఎస్టేట్ మార్కెట్ డిమాండ్ ప్రకారం దాదాపు 200ల కోట్ల రూపాయల వరకు ఉంటుందని చెబుతున్నారు. ఇదిలా ఉండగా మిగతా 15 మండలాల్లో దాదాపు 300ల ఎకరాలకు పైగా భూములు కూడా ఆక్రమణకు గురైనట్లు రెవెన్యూ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రస్తుతం దీనికి అనుగుణంగానే సర్వే చేపడుతున్నారు. ఈ మండలాల్లో పకడ్బందీ సర్వే చేపట్టి సర్కార్ భూముల వాస్తవ ఆక్రమణలపై స్పష్టత తీసుకురానున్నారు. అధికారుల అంచనా ప్రకారం ఆక్రమణకు గురైనట్లు భావిస్తున్న మరో 300ల ఎకరాల విలువైన భూముల విలువ బహిరంగ మార్కెట్ ప్రకారం 300ల కోట్ల రూపాయల వరకు ఉండవచ్చని భావిస్తున్నారు. అయితే అధికారులు ఇప్పటి వరకు ఆక్రమణకు గురైనట్లు నిర్ధారించిన భూములన్నింటినీ స్వాధీనం చేసుకుంటున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

● అభిలాష అభినవ్, జిల్లా కలెక్టర్



జిల్లాలో ప్రభుత్వ భూములతో పాటు శిఖం, ఫారెస్ట్, ప్రాజెక్టు కాలువల భూములను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూముల ఆక్రమణలను గుర్తించి ఆ భూములన్నింటినీ స్వాధీనం చేసుకునే చర్యలు వేగంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికీ స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారందరిపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నాం. ప్రభుత్వ భూములు ఆక్రమించే వారిని ఎవరినైనా కూడా వదిలిపెట్టం.

నాలుగు మండలాల్లో ఆక్రమణల గుర్తింపు

నిర్మల్ రూరల్ మండలంలో దాదాపు 6 కోట్ల రూపాయల విలువైన 35.03 ఎకరాల భూమి ఆక్రమణకు గురైనట్లు నిర్ధారించారు. భైంసా మండలంలో రెండు కోట్ల ఏడు లక్షల విలువైన 18 ఎకరాల 31 గుంటల భూమి, నర్సాపూర్(జి) మండలంలో రెండు కోట్ల నాలుగు లక్షల రూపాయల విలువైన 16 ఎకరాల భూమి, లోకేశ్వరం మండలంలో ఒక కోటి 35 లక్షల రూపాయల విలువైన 12 ఎకరాల 25 గుంటల భూమి ఆక్రమణకు గురైనట్లు అధికారులు వివరించారు. కేవలం ఈ నాలుగు మండలాల్లో దాదాపు 82 ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్లు తేల్చారు. ఈ ఆక్రమిత భూములన్నింటినీ స్వాధీనం చేసుకునే ప్రక్రియ ప్రస్తుతం వేగంగా సాగుతోంది. మిగతా 15 మండలాల్లో ఆక్రమణలపై నెల రోజుల్లోగా సర్వే ద్వారా నిర్ధారణ చేసిన ఆ భూములను కూడా స్వాధీనం చేసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

ప్రతీ మండలానికో భూ ప్రొఫైల్

ప్రతీ మండలానికి అన్ని రకాలకు సంబంధించిన ఒక భూ ప్రొఫైల్ రూపొందించనున్నారు. ముఖ్యంగా ఈ భూ ప్రొఫైల్‌లో ఆ మండలంలోని అన్ని గ్రామాల ప్రభుత్వ భూముల వివరాలను నమోదు చేయనున్నారు. ఈ ప్రొఫైల్ ఆధారంగా భూములను ఇక ఆక్రమించడం సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారు. ఒకవేళ ఆక్రమిస్తే వెంటనే గుర్తించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

క్రిమినల్ చర్యలకు రంగం సిద్ధం

ప్రస్తుతం జిల్లాలోని నాలుగు మండలాల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణకు పాల్పడి ఆ భూములను రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిని అధికారులు ఇప్పటికే గుర్తించారు. వీరి నుంచి ఈ విలువైన భూములను స్వాధీనం చేసుకోవడమే కాకుండా వీరందరిపై క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు కూడా రంగం సిద్ధం చేస్తున్నారు. ఆక్రమణదారులందరిపై పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేసి వారిపై క్రిమినల్ కేసులు నమోదయ్యేట్లు చూడనున్నారు. ఈ మేరకు రెవెన్యూ, ఇరిగేషన్, అటవీ శాఖలు సంయుక్తంగా సర్వే నెంబర్లతో సహా ఫిర్యాదులు చేసేందుకు సిద్ధమవుతున్నారు.



భూములను సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

వరద ముప్పును నివారించేందుకు శాశ్వత పరిష్కార చర్యలు

● జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



పట్టణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

నిర్మల్ రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జీఎన్ఆర్ కాలనీలో వర్షాకాలంలో ఏర్పడే వరద ముప్పును నివారించేందుకు శాశ్వత పరిష్కార చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. శనివారం ఆమె రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి అరవింద్ కుమార్, విపత్తు నిర్వహణ విభాగం డిప్యూటీ కమాండెంట్ దామోదర్ సింగ్‌లతో కలిసి కాలనీలో పర్యటించారు. కాలనీవాసులతో ముఖాముఖిగా మాట్లాడి వరదల వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి వివరంగా అధికారులు అడిగి తెలుసుకున్నారు. కొంతకాలంగా ప్రతిఏటా వర్షాకాలంలో తీవ్రంగా వరదలు సంభవిస్తున్నాయని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నివాసితులు పేర్కొన్నారు. అధిక వర్షపాతం కారణంగా వరద ముప్పు తలెత్తుతుందని, పరివాహక ప్రాంతాల్లో నిర్మించిన చెక్‌డ్యామ్ వల్ల నీటి ప్రవాహం వరద నీరు కాలనీలో చేరుతుందని కలెక్టర్ తెలిపారు. చెక్‌డ్యామ్ ఎత్తు తగ్గించేందుకు అనుమతులు లభించాయని, తగిన చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గతంలో సంభవించిన వరదల ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా వాటి తీవ్రతను అధికారులకు వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, తహసీల్దార్ రాజు, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

● ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

నిర్మల్‌అర్బన్ : ఉపాధ్యాయులే సమాజ నిర్మాణానికి మూలస్తంభాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. పట్టణంలోని నారాయణ ఒలంపియాడ్ పాఠశాలలో శనివారం నుంచి ప్రారంభమైన ఐదురోజులపాటు ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఉపాధ్యాయుడు ఉత్తమ బోధకుడిగా ఎదిగితేనే విద్యార్థులు విజేతలుగా మారగలరన్నారు. బోధననైపుణ్యాలు మెరుగుపడితే పఠన, లెక్కింపు, విశ్లేషణాత్మక ఆలోచనా సామర్థ్యాలు విద్యార్థుల్లో పెరుగుతాయన్నారు. ఉపాధ్యాయులు నిరంతరం కొత్త విషయాలు నేర్చుకుంటూ విద్యార్థులకు ఉత్తమ విద్య అందించాలని సూచించారు. ఐదు రోజుల శిక్షణ తరగతులను పకడ్బం దీగా నిర్వహించాలని కలెక్టర్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈవో పి.రామారావు, విద్యాశాఖ అధికారులు వి.నర్సయ్య, లింబాద్రి, జిల్లా ఉపాధ్యాయ శిక్షణ నిపుణులు పాల్గొన్నారు.

మొక్కజొన్న లోడు లారీ మాయం

● పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఏజెంట్

నర్సాపూర్(జి), మే 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూరుగుపల్లి(కే) గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు చేసిన ఏజెంట్ లోడు లారీ మాయం అయింది. కల్లూర్ గ్రామానికి చెందిన రైతులు సాయిరాం, పి.సాయన్న, కిషన్‌పటేల్, విలాస్ పటేల్‌కు చెందిన మొక్కజొన్నను 576 బ్యాగులను కల్లూర్ గ్రామానికి చెందిన ఏజెంట్ బొద్దుల శ్రీనివాస్ కొనుగోలు చేశాడు. కొనుగోలు చేసిన మొక్కజొన్న లోడును తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మైదం గణేష్ ఏజెంట్‌కు చెందిన లారీలో లోడు చేసి తూప్రాన్ పంపిస్తున్నానని తెలిపాడు. గుర్తుతెలియని లారీడ్రైవర్ ఫోన్ నెంబర్ 8886741248 మరుసటి రోజు స్విచ్ ఆఫ్ రావడంతో అనుమానం వచ్చి బూరుగుపల్లి గ్రామానికి వచ్చి మొక్కజొన్నలు లోడు చేసుకున్న లారీ నెంబర్‌తో ఫిర్యాదు చేయడానికి ఏప్రిల్ 26న కుంటాల పోలీస్‌స్టేషన్ వెళ్లినట్లు తెలిపారు. అక్కడ పోలీసులు బూరుగుపల్లి(కే) గ్రామం నర్సాపూర్(జి) పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుందని తెలపడంతో 28 ఏప్రిల్ రోజు నర్సాపూర్(జి) పోలీస్‌స్టేషన్‌లో బొద్దుల శ్రీనివాస్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నకిలీ విత్తనాల సంగతేంటి...

మండలంలోని అర్లి(కే) ఎక్స్ రోడ్ వద్ద గత సంవత్సరం నవంబరు రెండవ తేదీన నకిలీ విత్తనాలు రవాణా చేస్తూ పట్టుబడ్డ చందుల మహేష్‌ను పోలీసులు లోతుగా విచారించలేదని విమర్శలు ఉన్నాయి. రైతులకు నకిలీ విత్తనాలు అమ్ముతున్న, కొనుగోలు సమయంలో మోసం జరిగిన విచారణ జరిపే అధికారులు లేరని మండల ప్రజలు, రైతులు అంటున్నారు. ఏదిఏమైనా మొక్కజొన్న లారీ లోడు మాయం, నకిలీ విత్తనాలపై పోలీసు ఉన్నతాధికారులు లోతుగా విచారిస్తే అసలు విషయం బయటపడుతుందని రైతులు అంటున్నారు.

ప్రాధాన్యత ప్రకారం అభివృద్ధి

● మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్



మంజూరుపత్రాలను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

భైంసా, మే 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా ప్రాధాన్యతననుసరిస్తూ అభివృద్ధికి బాటలు వేస్తున్నామని ముథోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ పేర్కొన్నారు. శనివారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో వివిధ ప్రాంతాల్లో చేపట్టే అభివృద్ధి పనుల మంజూరుపత్రాలను ఆయా ప్రాంతాలవాసులు అందచేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మహాశివరాత్రి వేడుకలలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు సంబంధిత రోడ్డు నిర్మాణానికి కృషి చేసినట్లుగా వివరించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్ చంద్రే, బెజ్జంకి ముత్యం రెడ్డి, కుంటాల, భైంసా మండలాల మాజీ ఎంపీపీలు సయ్యాజీ బోజరామ్ పాటిల్, పొద్దుటూరి రాంచందర్ రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

'ప్రత్యేక అవసరాలు గల పిల్లల ఆత్మస్థైర్యం గొప్పది'

నిర్మల్ రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక అవసరాలు గల పిల్లల ఆత్మస్థైర్యం గొప్పదని జిల్లా విద్యాధికారి పి.రామారావు అన్నారు. చాణక్య పాఠశాలలో జరుగుతున్న ప్రత్యేక ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో విలీన విద్య సమన్వయకర్త ఎస్. ప్రవీణ్ కుమార్, కోర్స్ బాధ్యులు ఎస్. విద్యాసాగర్, ఎస్ఆర్‌పీలు దయానంద్, సునీల్, డీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు సత్యనారాయణ రెడ్డి పుస్తకాల గోడౌన్‌ను సందర్శించారు. గోడౌన్‌కి ఇప్పటివరకు ఎన్ని పుస్తకాలు వచ్చాయి. ఇంకా ఎన్ని రావాలి. ఇప్పటి వరకు ఎన్ని పంపిణీ చేశారు. పంపిణీ షెడ్యూల్ వివరాలు అడిగి తెలు సుకున్నారు. జిల్లా విద్యాధికారి పి. రామారావు పుస్తకాల గోడౌన్‌ను సందర్శించి, ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. శనివారం జిల్లాలోని నిర్మల్ అర్బన్, నిర్మల్ రూరల్, సోన్, కుబీర్ మండలాల్లోని కేజీబీవీలకు పాఠ్యపుస్తకలను పంపిణీ చేశారు. రేపు మిగతా కేజీబీవీలకు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీ ఈబీ సహాయ కార్యదర్శి, పుస్తక గోడౌన్ బాధ్యులు భానుమూర్తి, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

ఇద్దరి బైండోవర్

బాసర, మే 17 (ఆంధ్రజ్యోతి) : బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో ప్రధాన పూజారి సంజీవ్‌కుమార్, మాజీ ట్రస్టు బోర్డుసభ్యులు నూకం రామారావులను శనివారం తహసీల్దార్ పవన్‌చంద్ర ఎదుట బైండోవర్ చేసినట్లు బాసర ఎస్సై శ్రావణి తెలిపారు. ఇటీవలే వీరిద్దరు ఘర్షణ పడి ఒకరిపై ఒకరు పోలీసు కేసులు పెట్టుకున్న విషయం తెలిసిందే. వివాదానికి కారణమైన ఇద్దరిని బైండోవర్ చేసినట్లు తెలిసింది.

కడెం పరివాహక ప్రాంతాల్లో ముంపు నివారణకు చర్యలు

● రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్



కడెం ప్రాజెక్టును పరిశీలిస్తున్న ప్రభుత్వ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి

కడెం, మే 17 (ఆంధ్రజ్యోతి) : కడెం నది పరివాహక ప్రాంతాలు ముంపునకు గురికాకుండా అవసరమైన పటిష్ట చర్యలు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా పర్యటనలో భాగంగా ఆయన కడెం ప్రాజెక్టును సందర్శించి, గేట్ల పనితీరు, వరద నియంత్రణ ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎన్‌డీఆర్ఎఫ్ డిప్యూటీ కమాండర్ దామోదర్‌సింగ్, కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి ప్రాజెక్టు వద్ద జరిగిన విస్తృత సమీక్షలో ప్రత్యేక కార్యదర్శి పాల్గొన్నారు. గతంలో ప్రాజెక్టులో నీటి మట్టం పెరిగిన సమయంలో గేట్లు ఎత్తే ప్రక్రియలో లోపాలు తలెత్తిన నేపథ్యంలో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడినట్టు జిల్లా కలెక్టర్ వివరించారు. దీనిపై స్పందించిన అరవింద్‌కుమార్ అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కడెం, దస్తురాబాద్ మండలాల్లో వరద ముంపునకు గురయ్యే 10 నుంచి 12 గ్రామాల్లో మెరుగైన అలారం వ్యవస్థ ఏర్పాటు చేస్తామని తెలిపారు. వర్షాలు అధికంగా కురిసినప్పుడు వరద నీటిని సమర్థవంతంగా నియంత్రించేందుకు నీటిపారుదల శాఖ కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం ప్రాజెక్టు నిర్వహణ తీరును పరిశీలించిన ప్రత్యేక కార్యదర్శి ఇంజనీరింగ్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్న కళ్యాణి, ఎస్ఈ రవీందర్, ఈఈ విఠల్, తహసీల్దారు, ఎంపీడీవో అరుణ పాల్గొన్నారు.

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

● అదనపు కలెక్టర్ సైజాన్ అహ్మద్



వివరాలు అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

సారంగాపూర్, మే 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను విక్రయించడానికి తీసుకువచ్చిన ధాన్యంను వెనువెంటనే కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. శనివారం మండలంలోని ప్యారామూర్, బీరవెల్లి, తంద్రా, వంజర్ గ్రామాలలో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి నిర్వాహకులతో వివరాలను అడిగి తెలుసుకొని రైతుల కోసం తాగు నీటితో పాటు గోనె సంచుల కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత నిర్వాహకులదేనని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీదేవి, అధికారులు ముంతాజ్‌లతో పాటు రైతులు ఉన్నారు.

నిర్మల్‌రూరల్ : ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను శాంతియుతంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు జిల్లాలోని 11 పరీక్షా కేంద్రాల్లో సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ ఉపేందర్‌రెడ్డి, ఆర్డీవో రత్నకళ్యాణి పాల్గొన్నారు.

కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆందోళన



రైతులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

భైంసా, మే 17 (ఆంధ్రజ్యోతి):బీఆర్ఎస్ ప్రతినిధులు శనివారం భైంసా మండల పరిధిలోని పలు కొనుగోలు కేంద్రాలను సందర్శించి అక్కడ జరుగుతున్న కొనుగోళ్ల వ్యవస్థను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిరసనలకు దిగారు. బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ ప్రతినిధి డా.కిరణ్ కోమ్రేవార్ నేతృత్వంలో పార్టీ శ్రేణులు శనివారం మండలంలోని మహాగాం గ్రామంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. శనివారం వరకు కొనుగోళ్లు ప్రారంభించక పోవడాన్ని గుర్తించి నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ముథోల్ నియోజక వర్గ సమన్వయ కమిటీ ప్రతినిధి డా. కిరణ్ కోమ్రేవార్ మాట్లాడుతూ పూర్తిస్థాయిలో కొనుగోళ్లు జరుగడం లేదన్నారు.

వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తప్పని తిప్పలు

నర్సాపూర్(జి), మే 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అర్లి(కే) గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రంలో రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఈ సందర్భంగా రైతువినాయక్ పటేల్ మాట్లాడుతూ... శనివారం ఉదయం 53 బస్తాలను 41 కిలోలు 200ల గ్రాములు ఒక్కో బస్తా తూకం చేశారని మూడుకిలోలు తరుగు ఉంటుందని నిర్వాహకులు తెలిపినట్లు చెప్పాడు. రైతులకు బుక్‌కీపర్ రసీదు అందజేయకపోవడంతో రైతులకు కొనుగోలు కేంద్రాల్లో ఎన్ని క్వింటాళ్ల వరి ధాన్యం తూకం చేశారు. వరి రకం, తేమ శాతం వంటి రసీదులు ఇవ్వకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతులు అంటున్నారు.

ఎరువులు, విత్తనడీలర్లు నిబంధనలు పాటించాలి

● ముథోల్ ఏడీఏ వినయ్ బాబు

ముథోల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఎరువులు, విత్తనడీలర్లు ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఏడీఏ వినయ్‌బాబు సూచించారు. శనివారం నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లోని ఏడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల ఎరువుల, డీలర్ల సమావేశంలో మాట్లాడారు. వచ్చే సీజన్‌లో పాటించాల్సిన నియమ నిబంధనలు, స్టాక్ రిజిస్టర్ నిర్వహణపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టాక్‌బోర్డులు, ధరల పట్టిలను ప్రతి దుకాణంలో ఉంచాలన్నారు. రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని, కాలపరిమితి దాటినా విత్తనాలు అమ్మకూడదన్నారు. ప్రభుత్వం జారీచేసిన లైసెన్స్‌లను కలిగి ఉండాలన్నారు. నాణ్యమైన విత్తనాలు మాత్రమే సరఫరా చేయాలని సూచించారు. ప్రభుత్వం అనుమతి పొందిన కంపెనీల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, నిబంధనలు పాటించని డీలర్లపై చర్యలు తీసుకుంటామని, వారి లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. నిబంధనల మేరకు నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో రచన, విత్తన, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన డీసీఎస్‌వో



సాంగ్వి వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీసీఎస్‌వో

దిలావర్‌పూర్, మే 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సాంగ్విలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కోమల్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సమస్యలను అడిగితెలుసుకున్నారు. డీసీఎస్‌వో వెంట తహసీల్దార్ ఎజాజ్‌అహ్మద్‌ఖాన్, ఏవో రాజశేఖరరెడ్డి ఉన్నారు.

నర్సరీని పరిశీలించిన ఎంపీడీవో

ముథోల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆష్టా గ్రామంలో శనివారం ఎంపీడీవో శివకుమార్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షాకాలం సీజన్ కు సరిపడా మొక్కలను అందించడమే లక్ష్యంగా పని చేయాలని వారు సూచించారు. మొక్కలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అలాగే పారి శుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఉపరితల ఎరువు తయారీ తొట్టిని పరిశీలించారు. ఈయన వెంట కార్యదర్శి గంగాధర్ ఉన్నారు.

ముజ్గి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

నిర్మల్ రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ ముజ్గి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు తెలి పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన నాణ్యమైన సేవలను అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అధిక ప్రమాదం గల గర్భిణులను గుర్తించి వారిని ఫాలో అప్ చేస్తూ సకాలంలో వారికి సేవలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఆశిష్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



మత్తడిగూడలో పక్కగూడెం నుంచి నీటిని తెచ్చుకుంటున్న గిరిజనులు

బోరు చెడిపోవడంతో తప్పని తిప్పలు

● మత్తడిశంభుగూడలో తాగునీటి కష్టాలు

ఉట్నూర్, మే 17(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని మత్తడిశంభుగూడలో ఒక బోరుబి పూర్తిగా చెడిపోవడంతో మంచినీటి కష్టాలు ఏర్పడుతున్నాయని ఆదివాసీ గిరిజనులు వాపోతున్నారు. మత్తడి శంభుగూడలో రెండు బోరుబావులు ఉండగా ఒక బోరుబావి పూర్తిగా చెడిపోవడంతో కొత్తబోరు వేయాలని గిరిజనులు కోరుతున్నారు. ఒక బోరుబావి నీరు సరిపోక పోవడంతో పక్కగూడెం నుంచి నీళ్ల తెచ్చుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. మిషన్ భగీరథ నీరుకూడా సక్రమంగా రావడం లేదని గిరిజనులు తెలిపారు. ఈ విషయమై గ్రామ కార్యదర్శి సత్యనారాయణను ప్రశ్నించగా మిషన్ భగీరథ నీరు సరఫరా చేసి మోటర్ సాటర్ చెడిపోవడంతో శుక్రవారం సాయంత్రం కాస్త ఇబ్బంది జరిగిందని శనివారం మరమ్మత్తులు చేయించామని తెలిపారు. శంభు మత్తడిగూడలో కొత్త బోరు వేస్తే నీటి ఎద్దడి పరిష్కారం పూర్తిగా అవుతుందని తెలిపారు. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ జోక్యం చేసుకుని తమ గ్రామానికి కొత్త బోరు మంజూరు చేయాలని మత్తడిగూడ గ్రామస్థులు సిడాం రామ్‌షావు పటేల్, పంద్రాఆనంద్‌రావు, ఆత్రం మహాదు, సిడాం లింబారావులు కోరారు.

19న 'చలో ముథోల్' : భీమ్ ఆర్మీ

ఆదిలాబాద్ టౌన్, మే 17(ఆంధ్రజ్యోతి): ఈనెల 12న బుద్ధపూర్ణిమ రోజు ముథోల్‌లోని భోగిరాం గ్రామంలో ఏర్పాటు చేసిన బౌద్ధ విగ్రహాన్ని అదే స్థలంలో యధావిధిగా ఉంచాలని భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు షేక్ షకీల్ పేర్కొన్నారు. దాని కోసం ఈనెల 19న ముథోల్‌లో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. శనివారం ఆదిలాబాద్ ప్రెస్ క్లబ్‌లో ఈ విషయమై ఆయన మాట్లాడారు. ఈ శాంతి ర్యాలీలో బహుజనవాదులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

ఇంద్రవెల్లి, మే 17(ఆంధ్రజ్యోతి): మద్యం తాగుడికి బానిసై ఒకరు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం మండల కేంద్రంలోని భీంనగర్‌లో జరిగింది. కుటుంబ సభ్యులు, ఎస్సై ఇ.సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. భీంనగర్‌కు చెందిన కాంబ్లే రాజు(46) గత కాలం కాలంగా మద్యం తాగుడికి బానిసయ్యాడు. పలుమార్లు భార్య లక్ష్మీబాయి, కుటుంబ సభ్యులు మందలించిన మానేయలేదు. శుక్రవారం రాత్రి మద్యం తాగి ఇంటికొచ్చిన భర్తకు భార్య లక్ష్మీబాయితో పాటు కుటుంబ సభ్యులు మందలించగా క్షణికావేశంతో శనివారం ఉదయం బహిర్భూమికి అని వెళ్లి ఓ రైతు వ్యవసాయ చేన్‌లో పురుగుల మందు తాగి ఆత్మ చేసుకుని మృతి చెందాడు. మేకల కాపరి గిరి దత్తాత్రేయ చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే కుటుంబ సభ్యులకు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై ఇసాయన్న ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆ తర్వాత పంచనామా నిర్వహించి మృతేదహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య కాంబ్లే లక్ష్మీబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీబాయితో పాటు ఉల్లాష్, సోనికలు ఉన్నారు. రాజు మృతితో భీంనగర్‌లో విషాదాఛాయలు అలుముకున్నాయి.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, మే 17(ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని రాంపూర్, పీచర గ్రామస్థులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను విన్నవించారు. అంతేకాకుండా అటవీ శాఖ అధికారులు తమ పోడు భూములలో విత్తనాలు నాటి వ్యవసాయం చేయనియకుండా చేస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ పోడు భూముల జోలికి రాకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు అంతకుముందు బోథ్ మండల కేంద్రంలో గల వేదం పాఠశాల కరస్పాండెంట్ సంతోష్‌తో పాటు ఉపాధ్యాయులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి జూన్ 2వ తేదీన జరిగే వేదం పాఠశాల నూతన భవన ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను హాజరు కావాలని శాలువతో ఘనంగా సన్మానించి ఆహ్వానించారు. ఇందులో మండల నాయకులు, తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసిన పీచర గ్రామస్థులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

భూ.. బకాసురులు

(5వ పేజీ తరువాయి...)



ఎన్నో వివాదాలు, ఫిర్యాదులు వస్తున్నా.. పరిష్కారం చూపడం లేదు. గత పదేళ్ల క్రితం ఉన్న రికార్డులను తలకిందులు చేసి ధరణితో భారీ అక్రమాలకు తెరలేపినట్లు తెలుస్తుంది. కొంత మంది అవినీతి అధికారులు మామూళ్లకు అలవాటు పడి సైలెంటై పోవడంతో విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గుతున్న అధికారులు ప్రభుత్వ భూములను కాపాడేందుకు కనీస చర్యలు తీసుకోవడం లేదు. ఏదైనా ఫిర్యాదు వస్తే హడావుడి చేయడం.. ఆ తర్వాత అందినకాడికి దండుకోవడం కొందరికి అలవాటుగా మారిందంటున్నారు. రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో విలువైన ప్రభుత్వ భూములు కనిపించకుండానే పోతున్నాయి. అలాగే కొంతమంది ఫేక్ పత్రాలను సృష్టించి కోర్టుల ద్వారా స్టే ఆర్డర్లు తీసుకు రావడంతో ఇబ్బందికరంగానే మారిందంటున్నారు. ఏళ్ల తరబడి కోర్టుల్లో కేసులు ఉండడంతో ఏమీ చేయలేని పరిస్థితి ఉందని చెబుతున్నారు. ఇకనైనా ప్రభుత్వ భూములు, స్థలాలను కాపాడేందుకు అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

అక్రమంగా నిర్మిస్తున్న ఇల్లు సీజ్

ఆదిలాబాద్ టౌన్, మే 17(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇండ్ల నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రాజు హెచ్చరించారు. ఆదిలాబాద్‌లోని కేఆర్‌కే కాలనీలో కబ్జా చేసిన భూమిలో నయిం ఇంటిని నిర్మిస్తున్నాడు. బాధితులు కోర్టును ఆశ్రయించడంతో పనులను నిలిపి వేయాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని కమిషనర్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం పనులను ఆపివేసి ఇంటిని సీజ్ చేశామన్నారు.

తాంసిలో ముమ్మరంగా వాహనాల తనిఖీ

తాంసి, మే 17(ఆంధ్రజ్యోతి): నడిపే వాహనానికి నెంబర్ ప్లేట్ లేకున్నా, బండిపై ప్రయాణించే వారు హెల్మెట్ ధరించకున్న, సరియైన పత్రాలు లేకపోయినా పోలీసులు ఫైన్ వేస్తున్నారు. జిల్లా ఎస్పీ అఖిలేష్ మహాజన్ ఆదేశాల మేరకు పోలీసులు వాహనాల తనకిని ముమ్మరంగా చేస్తున్నారు. వాహనాల తనిఖీలు భాగంగా శనివారం మండలంలోని ఆయా ప్రాంతాల్లో పోలీసులు పెద్దఎత్తున వాహనాలు తనిఖీ చేసి పరిశీలించారు. వాహనాలు నడిపే వారు లైసెన్సులు లేకున్నా, హెల్మెట్ల ధరించకున్నా వారిపై ఫైన్ విధిస్తున్నారు. ఉదయం నుంచి ఈ కార్యక్రమాలు ప్రారంభించడంతో వాహన చోదకులో భయాందోళనలు మొదలవుతున్నాయి. తాంసి మండల కేంద్రంలో శనివారం ఈ తనిఖీ కార్యక్రమాన్ని ముమ్మారంగా చేపట్టారు. కొంతమంది వాహనాలు నడుపుతూ దొడ్డి దారిన పారిపోయేలా చూసినప్పటికీ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి వాహనాలకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రమేష్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నిబంధనలు పాటించకుంటే చర్యలు

● ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి

ఆదిలాబాద్ టౌన్, మే 17(ఆంధ్రజ్యోతి): బక్రీద్ నేపథ్యంలో పశువులను రవాణా చేసేవారు నిబంధనలు పాటించాలని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి సూచించారు. శనివారం ఆదిలాబాద్ 1వ టౌన్‌లో పశువులు అమ్మే వారితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎలాంటి పత్రాలు లేకుండా పశువులను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే వారిపై యానిమల్ క్రూయల్టీ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి



అక్రమంగా తరలిస్తున్న గోవులను పట్టుకున్న పోలీసులు

● అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత

సోనాల, మే17(ఆంధ్రజ్యోతి): అక్రమంగా గోవులను తరలిస్తున్న ట్రక్కును శనివారం తెల్లవారుజామున మండలంలోని ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టుకున్నట్లు సీఐ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆయన వివరాల మేరకు.. గ్వాలియర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కంటైనర్‌లో ఎటువంటి అనుమతులు లేకుండా ముప్పై కంకలు, నాలుగు మూగ దూడలు, మూడు ఆవులు ఉన్నట్లు తెలిపారు. అనంతరం పశువులను ఇచ్చోడ గోశాలకు తరలించి, అనంతరం కంటైనర్‌ను బోథ్ పోలీసు స్టేషన్‌కు తరలించి ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఎస్సై ప్రవీణ్, సిబ్బంది ఉన్నారు.

ఇందిరమ్మ ఇంటి కోసం అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా

నార్నూర్ రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): పేద దివ్యాంగులం అయిన తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కొత్తపల్లి(హెచ్) గ్రామానికి చెందిన గిరిజనుడు జాదవ్ శివకుమార్, పార్వతి, ప్రవీణ్ కుటుంబ సభ్యులు కలిసి శనివారం నార్నూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా, నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కావాలని ఇందిరమ్మ ఇళ్లను అర్హులకు ఇవ్వకుండా.. వారి వారి దగ్గర బంధువులకు, పార్టీ కార్యకర్తలకు పేర్లు మంజూరు చేయడంపై గ్రామంలో అభ్యంతరం వ్యక్తం చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అంతేకాకుండా పైసలు కావాలని డిమాండ్ వారు ఈ సందర్భంగా ఆరోపించారు. ఇప్పటికీ స్పందించకపోతే ఇక ఆమరణ దీక్షకు దిగుతామని వాపోయారు. ఇప్పటికైనా కలెక్టర్ తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

అకాల వర్షం... నీటిపాలైన వరిధాన్యం

ఖానాపూర్, మే 7 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలు అన్నదాతను హడలెత్తిస్తున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు జిల్లాలో పలు చోట్ల ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడి న వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా శనివారం సగటు న 3.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. భైంసా మండలం లో అత్యధికంగా 19.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

సారంగాపూర్ : మండలంలోని తదితర గ్రామాల్లో ఆరుగాళం శ్రమించి పండించిన వరి ధాన్యం, విక్రయించే సమయంలోనే శనివారం మధ్యాహ్నం అకాల వర్షం కురవడంతో వరి ధాన్యం తడిసి ముద్దయింది. రైతులు టార్పాలిన్‌లను ధాన్యంపై వేసినప్పటికి ఈదురుగాలులతో కూడిన బారీ వర్షం కురవడంతో వరి ధాన్యం తడిసి ముద్ద అవడంతో రైతులు ఆందోళన గురవుతున్నారు. సుమారు ఒక్కొక్క రైతుకు రూ. లక్ష 50వేల నుండి 2లక్షల వరకు నష్టం జరిగిందని రైతులు పేర్కొంటున్నారు. మండల కేంద్రంతో పాటు కొట్ల, స్వర్ణ గ్రామాలతో పాటు తదితర గ్రామాలలో అకాల వర్షం కురవగా కొనుగోలు కేంద్రాలకు విక్రయించడానికి తీసుకువచ్చిన మొక్కజొన్నతో పాటు జొన్నలు తడిసి ముద్దయ్యాయి.

భైంసా రూరల్ : భైంసా మండలంలో శుక్రవారం రాత్రి అకాలవర్షం కురియడంతో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. కోతుల్‌గాం, బిజ్జూర్, చింతలపూడి, మహాగాం, వానల్‌పాడ్, దేగాం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతున్నారు. అకాల వర్షంతో తడిసి ముద్దయిందని ఆవేదన చెందుతున్నారు. నాలుగు నెలల పాటు కష్టపడి పండించిన పంట నష్టపోవడంతో గిట్టుబాటు ధర చెల్లించాలన్నారు.



తడిసిన ధాన్యంపై టార్పాలిన్‌లను కప్పుతున్న రైతులు



కోతుల్‌గాం గ్రామంలో తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు

బీజేపీ సోన్ మండల కార్యవర్గం ఎన్నిక



మార గంగారెడ్డి

సోన్, మే 17 (ఆంధ్రజ్యోతి) : బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు భారతీయ జనతా పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ ఆధ్వర్యంలో సోన్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సోన్ మండల అధ్యక్షులు మార గంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీ పటిష్టత, బలోపేతం కోసం తమ వంతుగా పూర్తి స్థాయిలో కృషి చేయాలని తెలియజేశారు. ఉపాధ్యక్షులు పెసరి గణేష్, బోనగిరి గంగయ్య, మద్దెల గంగాధర్, ఎలుగు విజయ, ప్రధాన కార్య దర్శులుగా సుంచు నవీన్, మామి డాల సంతోష్, కార్యద ర్శులుగా మేకల మల్లేష్, జక్క ప్రశాంత్, బద్ధం గంగారెడ్డి, ఏ. శైలజ, ట్రెజరీగా కే.లావణ్యతో పాటు 45 మంది జాబితాను విడుదల చేశారు.

సారంగాపూర్ : మండల బీజేపీ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఆ పార్టీ మండల అధ్యక్షులు కాల్వనరేష్ ఎన్నిక కాగా ఉపాధ్యక్షులుగా డోకూర్ భీమలింగం, కొప్పుల నర్సయ్య, ఈర్ల విజయ్, తిరుమలచారి, మండల ప్రధాన కార్యదర్శులుగా ఇప్ప శ్రీకాంత్‌రెడ్డి, రాథోడ్ నారాయణ, కార్యదర్శులుగా టి.గణేష్, నాగుల రతన్‌రెడ్డి, సుంకరి శ్రీకాంత్, శ్రీనివాస్, కోశాధికారిగా నవీన్‌లను ఎన్నుకున్నారు.

మైనర్లు వాహనాలు నడపవద్దు

మామడ, మే 17 (ఆంధ్రజ్యోతి) : మైనర్లు వాహనాలు నడపవద్దని మామడ ఎస్సై అశోక్ అన్నారు. శనివారం రోజున మామడ మండల కేంద్రంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులతో పాటు వాహనం ఇచ్చిన వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. వాహనదారులు సరైన పత్రాలు వెంట ఉంచుకోవాలని, బైక్ నడిపే వారు హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు నిబంధనలు అందరూ పాటించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపినట్లయితే జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పవన్నారు.

డబుల్‌బెడ్ రూమ్‌లను ఇవ్వాలని వినతి

నర్సాపూర్(జి), మే 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వాహిద్‌ఉద్దీన్‌కు గురువారం గ్రామ మహిళలు డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సునీత, రాణి, తహసీన్, ఆమని, రాజమణి, పుష్ప, ఫాహిమా బేగం, సాయవ్వ, లావణ్య, లక్ష్మీ, గోదావరి, నిరోషా, వనతి, లక్ష్మీ, శాంతాబాయి, అజీరా బేగం, పేద మహిళలు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న బ్యాంక్ సిబ్బందికి సన్మానం

నిర్మల్ రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : బ్యాంక్ ఆఫ్ బరోడాలో పని చేస్తున్న మేనేజర్ జయంత్, అధికారులు అనిల్ కుమార్, రాజశేఖర్ రెడ్డి బదిలీపై వెళ్తున్న సందర్భంగా వారిని శనివారం బ్రాంచ్ సిబ్బంది ఘనంగా సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణా రాథోడ్, గంగాధర్, మనోహర్, గోల్డ్ అప్రైజర్స్ కోటరిగి శ్రీధర్, ముప్పిడి సూర్యనారాయణ, సబ్ స్టాఫ్ రాజు, వినోద్, ఆధార్ సెంటర్ రాజు పాల్గొన్నారు. ఆదిలాబాద్ నుండి వచ్చిన ప్రీతం రాజ్ స్వరూప్‌కి బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.

'ఎంపీని అగౌరవపరచడం సమంజసం కాదు'

నిర్మల్ రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఎంపీని అగౌరవపరచడం ఎంత వరకు సమంసజమని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మాజీ ఎస్సీ సెల్ కార్యదర్శి ముడుసు సత్యనారాయణ అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద మాట్లాడుతూ సరస్వతి పుష్కరాలలో పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు జరిగిన అవమానంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీ అయాని వంశీకృష్ణ పుష్కరాలకు ఆహ్వానించలేదని అన్నారు. దీని వెనుక ఏ నాయకులు ఉన్నారో బాధ్యత వహించాల్సిందని, ఇకముందు ఈ విధంగా జరిగితే రాష్ట్ర వ్యాప్తంగా దళిత బడుగు, బలహీన వర్గాల సోదరులు ఊరుకునేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వెలుగు రాజేశ్వర్, నిర్మల్ డివిజన్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు ముడుసు రాము పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ నరసింహ స్వామి నాగవెల్లి



లక్ష్మీ నరసింహ స్వామి నామస్మరణతో భక్తుల నృత్యాలు

దిలావర్‌పూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి నాగవెల్లిని శనివారం తెల్లవారు జాము న నాలుగు గంటలకు వైభవంగా నిర్వహించారు. ఆలయ యజ్ఞాచార్యులు నరసింహామూర్తి నేతృత్వంలో ఆలయ అర్చకులు శ్రీనివాస్, రాము, వెంకటేష్‌లు స్వామి వారిని అందంగా ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు చేశారు. సాంప్రదాయక తీరిలో స్వామి వారికి నాగవెల్లిని ఘనం గా నిర్వహించారు. స్వామివారి నాగవెల్లిని కనులారా చూసి తరిం చేందుకు శనివారం తెల్లవారుజామున భక్త లు భారీగా తరలివ చ్చారు. అంతకు ముందు భూతబలి, ఉద్వాసన బలిపూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి ఏకాంతోత్సవం నిర్వహించారు. భక్తుల శ్రీలక్ష్మీ నరసింహస్వామి గోవింద నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. తమ ఇంటి ఇలవేల్పు శ్రీ కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానానికి నిజామాబాద్ జిల్లాకు చెందిన భక్తులు శనివారం విరాళం అందజేశారు. నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలం అన్నారం గ్రామానికి చెందిన సింగిడి భూమారెడ్డి దంపతులు శనివారం శ్రీ కాల్వ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రూ. ఒక లక్ష ఒక రూపాయి విరాళాన్ని దేవస్థానం అభివృద్ధి కోసం ఈ నిధులను వినియోగించాలని కోరుతూ దేవస్థానం జూనియర్ అసి స్టెంట్ మనో హర్‌కు అందజేశారు.

'అటవీ సాగుభూముల నుంచి గెంటి వేయడం ఆపాలి'

నిర్మల్ రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : తరతరాలుగా అటవీ భూములను సాగు చేసుకుంటూ బతుకుతున్న పేదలను ఆ భూముల నుంచి వెళ్లగొట్టే ఫారెస్ట్ అధికారుల చర్యలు ఆపాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి జే. రాజు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేసి, ఏవోకు వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ అధికారులు భూముల నుంచి వెళ్లగొడతామని ఖానాపూర్, కడెం మండలాల పరిధిలోని పేదలను బెదిరిస్తున్నారు. ఇది తగదని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సాగు చేస్తున్న వారికి పట్టాలు ఇస్తామని చెబుతుంటే అధికారులు దానికి విరుద్ధంగా భూముల నుంచి వెళ్లగొట్టే పని చేయడం దారుణమని, భూములను నిలుపుకునే విధంగా పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కే. సర్దార్, ఎం. హరిత, అల్లంపల్లి గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్‌రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : టౌన్ 3 ఏరియాలో ని ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంద డీఈ నాగరాజు పత్రిక ప్రకటనలో తెలిపారు. టౌన్ 3 ఏరియాలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయుటకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మహాలక్ష్మి వాడ, డబుల్ బెడ్ రూమ్ ఏరియాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నర్సాపూర్(జి), మే 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన అబ్దుల్ ఇర్ఫాన్ అలీ(38) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 7వ తేదీన వరిలోడును లోకేశ్వరం మండలం రైస్‌మిల్‌లో వదిలేసి అక్కడి నుంచి నర్సాపూర్(జి)కి తన మోటార్ సైకిల్‌పై వస్తుండగా మార్గమధ్యలో అర్లి ఎక్స్ రోడ్ దాటిన తర్వాత మోటార్ సైకిల్ అదుపు తప్పి కింద పడిపోవడంతో అబ్దుల్ ఇర్ఫాన్ అలీకి తల వెనుకవైపు బలమైన గాయమైంది. వెంటనే ఇరుగుపొరుగు వారి సహాయంతో 108 అంబులెన్స్‌లో నిర్మల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స గురించి నిజామాబాద్‌లోని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్న శనివారం రాత్రి మరణించాడు. మృతుడి భార్య అంజుమ్ బేగం దరఖాస్తు మేరకు ఏఎస్సై శంకర్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

టిప్పర్‌ను ఢీకొని ఒకరి మృతి

భైంసా రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మీర్జాపూర్ గ్రామ సమీపంలో బైక్, టిప్పర్ ఢీకొని ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సాంగ్వి గ్రామానికి చెందిన కట్కం గంగాప్రసాద్(21) సొంత పనుల నిమిత్తం భైంసా నుంచి సాంగ్వి గ్రామానికి వెళ్తుండగా మీర్జాపూర్ గ్రామ సమీపంలో మొరం తీసుకెళ్తున్న టిప్పర్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై మృతి చెందాడు. ఘటన స్థలాన్ని చేరుకొని మృతదేహాన్ని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. తండ్రి గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి



ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకులు

కుభీర్, మే 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కళాశాలలో చేరాలంటూ శనివారం కుభీర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రం కుభీర్‌లో పదోతరగతి పాస్ అయిన విద్యార్థుల ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, స్కాలర్‌షిప్, నాణ్యమైన విద్య, పోటీ పరీక్షలపై అవగాహన తరగతులు తదితర సౌకర్యాలను విద్యార్థులకు వివరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు సంపత్, నర్సయ్య, తదితరులున్నారు.

నిద్రిస్తున్న వారిపైకి దూసుకెళ్లిన ఐస్‌క్రీమ్ బండి

● ఇద్దరికి తీవ్రగాయాలు



మంచంలో నిద్రిస్తున్న వారి పైకి దూసుకెళ్లిన ఐస్‌క్రీమ్ వాహనం

మామడ, మే 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొరటికల్ గ్రామంలో ఇంటి ముందు మంచంలో నిద్రిస్తున్న కొమ్ము లక్ష్మీ(45), మనుమడు కొమ్ము రితీష్(7) ఇద్దరి పైనుంచి ఐస్‌క్రీమ్ బండి వాహనం దూసుకువెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లక్ష్మణ చాంద నుంచి నిర్మల్ వైపువెళ్తున్న ఐస్‌క్రీస్ వాహనం అర్ధరాత్రి సమయంలో కొరటికల్ వద్ద అదుపు తప్పి ఓ ఇంటి ఎదుట నిద్రిస్తున్న వారిపైకి దూసు కెళ్లింది. దీంతో వారికి తీవ్రగాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మామడ ఎస్సై అశోక్ తెలిపారు.

ప్లాస్టిక్ అమ్ముతున్న యజమానులకు జరిమానా

నిర్మల్ రూర్, మే 17 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణంలోని సింగిల్ యూస్ ప్లాస్టిక్ అమ్ముతున్నటువంటి షాప్‌లకు జరిమానాలు విధించామని తెలిపారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ మాటాడుతూ... పట్టణంలోని ప్రజలు ప్లాస్టిక్ వాడకూడదని, బట్ట సంచులు వాడి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని తెలియజేశారు.





● జిల్లాకేంద్రంలో న్యూహౌజింగ్ బోర్డు కాలనిలోని 72 సర్వే నెంబర్‌లో అక్రమాలను తొలగిస్తున్న అధికారులు



● 72 సర్వే నెంబర్‌లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు

భూ.. బకాసురులు

- జిల్లాలో కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములు కనుమరుగు
- నకిలీ ధ్రువపత్రాలతో అసైన్డ్ భూములు, విలువైన స్థలాలు కబ్జా
- మున్సిపల్, మావల, బట్టిసావర్గాం పరిధిలో భారీగా ఫేక్ డోర్ నెంబర్లు
- సబ్ రిజిస్ట్రేషన్, మున్సిపాలిటీ కేంద్రంగా కొనసాగుతున్న నకిలీ దందా
- మామూళ్లకు అలవాటు పడి మొద్దునిద్రలో రెవెన్యూ శాఖ అధికారులు
- లోతుగా దర్యాప్తు జరిపితేనే బయటపడనున్న బడా బాబుల భూ బాగోతం

ఆదిలాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూ కబ్జాకోరుల కన్నుపడి విలువైన ప్రభుత్వ భూములు కనిపించకుండానే పోతున్నాయి. ఖాళీ జాగా కనిపిస్తే చాలు భూ బకాసురులు పాగా వేసేస్తున్నారు. గత కొన్నేళ్లుగా భూముల ధరలకు రెక్కలు రావడంతో విలువైన భూములను దక్కించుకునేందుకు ఎంతకైనా తెగిస్తున్నారు. అడిగే వారే లేకపోవడంతో అదును చూసి ఫేక్ సర్టిఫికెట్లతో రిజిస్ట్రేషన్లు చేస్తూ అధికారులనే బురిడి కొట్టిస్తున్నారు. దొరికితే దొంగ.. లేదంటే దొర అన్న చందంగా భూమాఫియా తీరు కనిపిస్తుంది. జిల్లాకేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లోని మావల, బట్టిసావర్గాం, ఆదిలాబాద్ రూరల్ పరిధిలో వందలాది ఎకరాల అసైన్డ్ భూములు భూమాఫియా చేతుల్లోకి వెళ్లి పోయాయి. జిల్లా కేంద్రం చుట్టూ ఉన్న చెరువులు, కుంటలు, కందకాలను నేలమట్టం చేసి అక్రమ వెంచర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇదంతా రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు తెలిసినా.. తెలియనట్లుగానే వ్యవహరించడంతో భూ కబ్జాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. తాజాగా జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్ కాలనీలో 469.44 స్వేర్ యార్డ్ విలువైన ఖాళీ స్థలాన్ని 6-6-36/2/1 ఫేక్ డోరు నెంబర్‌తో ఆక్రమించేందుకు ప్రయత్నించిన పలువురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. అలాగే న్యూహౌజింగ్ బోర్డు కాలనీలోని 72 సర్వే నెంబర్‌లో అక్రమంగా వెలిసిన నిర్మాణాలు, ఫెన్సింగ్ వైర్‌ను అధికారులు జేసీబీలతో ధ్వంసం చేయడం చర్చనీయాంశంగా మారింది. అంతే కాకుండా గతంలో ఇలాంటి ఘటనలు ఎన్నో జరిగినా.. పోలీసులు పెద్దగా పట్టించుకున్నట్లు కనిపించ లేదు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాలతో పోలీసులు చట్ట పరమైన చర్యలకు దిగుతున్నారు. అయితే సంబంధిత రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. కొంతమంది అవినీతి అధికారులే భూ మాఫియాకు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఫేక్ సాదాబైనామాలు

రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఆరితేరిన కొంతమంది వ్యాపారులు భూముల వివరాలను తార్‌మార్ చేస్తూ అడ్డగోలు దందాలకు ఎగబడుతున్నారు. రెవెన్యూ అధికారులతో సన్నిహితంగా ఉంటూ రికార్డులనే తలకిందులు చేస్తున్నారు. రెవెన్యూ చట్టాలపై కొంత అవగాహన ఉంటే చాలు విలువైన భూములను ఎసరు పెడుతున్నారు. ఆర్థిక, రాజకీయ పలుకుబడితో అధికారులు అడ్డురాకుండా జాగ్రత్త పడుతున్నారు. భూములను కబ్జా చేయడం, రికార్డులను మార్చేసి వెంచర్లు వేసి అమ్మేసుకోవడం కొందరికి పరిపాటిగానే మారింది. ఏళ్ల తరబడి కాస్తులో ఉన్నామంటూ ఫేక్ సాదాబైనామాలను సృష్టించి వాటి ఆధారంగానే రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. జిల్లా కేంద్రం చుట్టుపక్కల ఉన్న వందలాది ఎకరాల అసైన్డ్ భూములు ప్రస్తుతం కనిపించకుండానే కనుమరుగై పోయాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా అధికారుల తీరు కనిపిస్తుందన్న ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రం, పరిసర ప్రాంతాల్లోని కొన్ని సర్వే నెంబర్లను పరిశీలిస్తే ఏస్థాయిలో అక్రమాలు జరిగాయో బయటపడే అవకాశం ఉంటుంది.

అడ్డగోలుగా ఫేక్ డోర్ నెంబర్లు

జిల్లాకేంద్రంతో పాటు మావల, బట్టిసావర్గాం పరిధిలో వందలాది ఫేక్ డోర్ నెంబర్లను జారీ చేసినట్లు తెలుస్తుంది. అడిగినంత ఇస్తే మున్సిపల్, పంచాయతీ అధికారులు అడ్డగోలుగా ఫేక్ డోర్ నెంబర్లను కేటాయిస్తున్నారు. ఎలాంటి నిర్మాణాలు చేపట్టక పోయినా ఓపెన్ ప్లాట్లకే డోర్ నెంబర్లను కేటాయించడం.. దానాధారంగానే రిజిస్ట్రేషన్‌లు చేయడం మాములుగా మారిపోయింది. గత పదేళ్లుగా ఆదిలాబాద్ మున్సిపాలిటీతో పాటు మావల, బట్టిసావర్గాం గ్రామ పంచాయతీల పరిధిలో జారీ చేసిన డోర్ నెంబర్లను పరిశీలిస్తే అసలు బాగోతం బయట పడే అవకాశం ఉంది. క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే డోర్ నెంబర్లను కేటాయించారు. ఒక్కో డోర్ నెంబర్‌కు రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తుంది. అలాగే, అక్రమ వెంచర్లు, ప్రభుత్వ అసైన్డ్ భూములు, ఓపెన్ ప్లాట్లకు యథేచ్ఛగా డోర్ నెంబర్లను కేటాయిస్తున్నారు. ఇలాంటి తప్పిదాలతోనే చాలా వరకు భూ వివాదాలు తలెత్తుతున్నాయి.

అధికారుల ఇష్టారాజ్యం

ఆదిలాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు మున్సిపాలిటిలో కొంతమంది అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. మామూళ్లకు అలవాటు పడి ప్రభుత్వ నిబంధనలనే తారుమారు చేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. కొందరు అధికారులు రెవెన్యూ చట్టాల్లోని లొసుగులను ఆసరాగా చేసుకుంటూ అడ్డగోలు సంపాదనకు ఎగబడుతున్నారు. అడిగినంత ఇస్తే రాత్రికి రాత్రే భూములను రిజిస్ట్రేషన్ చేయడం అధికారులకు అలవాటుగానే మారింది. ఇటీవల జిల్లాకేంద్రంలోని భాగ్యనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఓ వెంచర్‌లో 3-1-221/1/4 అనే డోర్ నెంబర్‌తో 30/40 ఓపెన్ ప్లాట్లను అడ్డదారిలో ఆదిలాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్‌లకు పాల్పడిన దాఖలాలు ఉన్నాయి. ఇలా వందలాది రిజిస్ట్రేషన్లు డోర్ నెంబర్లతోనే జరిగి పోతున్నాయి. దీనిపై లోతుగా దర్యాప్తు జరిపితే నకిలీ దందా బాగోతం బయటపడే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా సబ్ రిజిస్ట్రార్, మున్సిపల్, రెవెన్యూ శాఖలపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేకదృష్టిని సారించాల్సిన అవసరం ఉంది.

పర్యవేక్షణ కరువు

రెవెన్యూ అధికారుల క్షేత్రస్థాయి పర్యవేక్షణ కరువవుతుంది. దీంతో భూమాఫియా ఆగడాలు పెరిగి పోతున్నాయి. ప్రభుత్వ భూములను రక్షించాల్సిన అధికారులు కార్యాలయాలకే పరిమితమవుతున్నారు. ఇప్పటి వరకు భూ సరిహద్దులపై

(తరువాయి 6వ పేజీలో...)



ఆస్పత్రి యాజమాన్యానికి పత్రం అందజేస్తున్న ఎస్పీ

పోలీసు సిబ్బందికి నగదు రహిత చికిత్సలు : ఎస్పీ

ఆదిలాబాద్ టౌన్, మే 17(ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బందికి వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య భద్రత కింద వైద్య సేవలు ఇకపై ఆదిలాబాద్ జిల్లాలోనే మొదటిసారిగా ప్రారంభిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. పోలీస్ సిబ్బందికి ఆరోగ్య భద్రత నగదు రహిత చికిత్స సేవలను శనివారం పట్టణంలోని నక్షత్ర ఆస్పత్రిలో ఎస్పీ ప్రారంభించారు. ఈ మేరకు ఆస్పత్రి యాజమాన్యానికి పత్రాలను అందజేశారు. ఇక నుంచి స్థానికంగానే పోలీస్ సిబ్బంది ఉచిత చికిత్సలు పొందవచ్చన్నారు.

రావి చెట్టుపై పిడుగుపాటు

తాంసి, మే 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పగలంతా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతూ, సాయంత్రం ఆకాశం మేఘావృత్తమై తేలికపాటి జల్లులు కురుస్తున్నాయి. శుక్రవారం సాయంత్రం తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలకు వర్షం ఊరటనిచ్చింది. కాగా, తాంసి మండల కేంద్రం సమీపంలోని పాఠశాల వెనుకాల గల పంట చేనులో రావి చెట్టుపై అగ్గిపిడుగు పడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

బీభత్సం సృష్టించిన అకాల వర్షం

● ఇంద్రవెల్లి మండలంలోని పలు గ్రామాల్లో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు ● గాలికి ఊడిపోయిన ఇళ్ల పైకప్పులు, రేకులు

ఇంద్రవెల్లి, మే 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం రాత్రి ఈదురు గాలులతో కురిసిన అకాల వర్షం బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులతో మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో విద్యుత్ స్తంభాలపై చెట్లు పడటంతో మొత్తం 22 విద్యుత్ స్తంభాలు నేలకొరితిగాయి. దీంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. శనివారం మరమ్మతు పనులను చేసి విద్యుత్ సరఫరా చేశారు. మరమ్మతు పనులను ఉట్నూర్ డీఈ సుభాష్ పర్యవేక్షణ చేశారు. ఈదురుగాలులతో మండలంలోని కేస్లాగూడ గ్రామంలో వెడ్మ అంబాజీ, ధర్మాసాగర్ గ్రామంలో గోతి సర్దార్, సాబ్లే జైత్రం, సాబ్లే లాల్‌సింగ్, గోతి, సైనాబాయి, శ్యామ్‌రావు, నాథ్‌సింగ్, రాజేందర్‌ల ఇళ్ల పైకప్పు రేకులు ఊడిపోయాయి. దీంతో నిత్యావసర సరుకులు తడిసిపోయాయని తెలిపారు. అధికారులు వెంటనే ఇళ్ల రేకులు ఊడిపోయి నష్టపోయిన ఇళ్లను సర్వే నిర్వహించి పరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరారు.



ధర్మసాగర్‌లో ఊడిపోయిన ఇంటి పైకప్పు రేకులు

● సర్వం కోల్పోయిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి : బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్

ఇంద్రవెల్లి: గాలి, వానా బీభత్సానికి సర్వం కోల్పోయిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని మల్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ధర్మాసాగర్ గ్రామంలో శుక్రవారం రాత్రి గాలి, వాన బీభత్సానికి అతలాకుతలం అయ్యిందని సమాచారం అందించడంతో హుటాహుటిన ధర్మసాగర్ చేరుకొని బాధితులకు అండగా ఉంటాననీ భరోసా కల్పించారు. దీంతో వెంటనే ఆయన అధికా రులతో మాట్లాడారు. విపత్తు నిధి నుంచి బాధితులను ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో బాధితులందరికీ ఇళ్లు నిర్మించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీజేపీ జిల్లా ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి శేషారావ్, బీజేపీ జిల్లా కార్యనిర్వాహక సభ్యులు జైస్వాల్ శివకుమార్, నాయకులు మాస్కే రాజవర్ధన్, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్



రోడ్డుపైనే వారాల తరబడి నిల్వ ఉన్న జొన్న కుప్పలు

జొన్న రైతుల పరేషాన్..!

● ఒకేసారి పెద్దఎత్తున జొన్నలు రావడంతో తూకాల్లో జాప్యం
● రెండు రోజులుగా వర్షాలతో తప్పని ఇక్కట్లు

తాంసి, మే 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సహకార సొసైటీ ఆధ్వర్యంలో గత నెల రోజులుగా జొన్నలను కొనుగోలు చేస్తున్నారు. అయితే ఒకేసారి పెద్దఎత్తున జొన్నలు రావడంతో తూకాల్లో కొంత జాప్యం జరుగుతుంది. గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో తమ జొన్నలను తడవకుండా కాపాడుకునేందు కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. అధికారులు త్వరితగతిన జొన్నలు కొనుగోలను పూర్తి చేయాలని తాంసి, భీంపూర్ మండల రైతుల కోరుతున్నారు.

19 వరకు జొన్న పంట కొనుగోళ్లు పూర్తి

బోథ్, మే 17(ఆంధ్రజ్యోతి): బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న సోనాల జొన్న కొనుగోలు కేంద్రం లో ఈనెల 19 వరకు మాత్రమే జొన్న పంట కొనుగోలు చేపడతామని సీఈవో గోలి స్వామి తెలిపారు. రైతులు పండించిన జొన్న పంటను ఈనెల 19లోగా మార్కెట్లోకి తీసుకురావాలని సెంటర్ ఇన్‌చార్జి గోలి స్వామి తెలిపారు. అంతేకాకుండా రైతులు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని పంటను ఈనెల 19వ తేదీ సాయంత్రం లోగా తీసుకురావాలని సూచించారు.



తాంసిలో హనుమాన్ పల్లకీ ఊరేగింపు నిర్వహిస్తున్న స్వాములు

కన్నుల పండువగా హనుమాన్ పల్లకీ ఊరేగింపు

తాంసి, మే 17(ఆంధ్రజ్యోతి): తాంసి మండల కేంద్రంలో హనుమాన్ పల్లకీ ఊరేగింపు కన్నుల పండువగా సాగింది. శనివారం మండల కేంద్రంలోని హనుమాన్ దీక్షపరులు స్వామివారి పల్లకీని వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. ఆ తర్వాత వేద పండితుడు సతీష్ సమక్షంలో వేద మంత్రోచ్చరణల మధ్య హనుమాన్ పల్లకీ ఊరేగింపు కార్య క్రమాన్ని గ్రామంలోని ప్రధాన వీధులు గుండా నిర్వహించారు. కాగా, మహిళలు పల్లకీకి మంగళహారతులు పట్టారు. దీంతో గ్రామంలో అధ్యాత్మిక వాతా వరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో హనుమాన్ దీక్షపరులు సాయి, రాహుల్ రెడ్డి, కార్తీక్, అక్షయ్, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్

ఉట్నూర్, మే 17(ఆంధ్రజ్యోతి): అత్యవసర పరిస్థితుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలను ఆదుకోవాలని స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం ఉమ్మడి జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఉట్నూర్‌కు చేరుకున్న స్పెషల్ సెక్రెటరీ అరవింద్ కుమార్‌కు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా మొక్కను అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పీవో క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం కురిసిన వర్షాలకు నష్టపోయిన ప్రాంతాలలో ఏమి చర్యలు చేపట్టారని ఆయన ఈ సందర్భంగా తెలుసుకున్నారు. జిల్లాలోని గిరిజన ప్రాంతాలలో వడదెబ్బకు ఎవరైనా గురయ్యారా, వడదెబ్బకు ప్రజలు ఉపాధి కూలీలు గురికాకుండా ఎలాంటి చర్యలు చేపట్టారో తెలుపాలని ఏజెన్సీ వైద్యాధికారి డాక్టర్ మనోహర్‌ను ప్రశ్నించారు. అదే విధంగా వర్షాకాలంలో మారుమూల గిరిజన గ్రామాల ప్రజలకు సత్వర వైద్య సేవలు అందించడానికి ముందస్తుగా గ్రామాలలో మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. గత సంవత్సరం వరద ప్రాంతాలలో చేపట్టిన అభివృద్ధి పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సమావేశంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ఐటీడీఏ ఏపీఓ జనరల్ జాదవ్‌వసంతరావు, ఇన్‌చార్జీ డీడీ జాదవ్ అంబాజి, అదనపు ఏజెన్సీ వైద్య అధికారి కుడిమెత మనోహర్, పీవీటీజీ ఏపీవో మేస్రం మనోహర్, పరిపాలన అధికారి దామోదర స్వామి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రత్యేక కార్యదర్శి అరవింద్ కుమార్



హాజరైన అధికారులు